సాక్షి తిరుపతి

ఆదివారం । 24 । నవంబర్ । 2024



బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్టు టీటీడీ ఈఓ తెలిపారు. - 8లో



30 దుంగలు స్వాధీనం

అక్రమంగా తరలిస్తున్న 30 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. - 8లో



ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

వివాహేతర సంబంధం ఓ యువకుడి హత్యకు దారితీసింది. ఈ ఘటనలో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు రౌండ్-2 స్పెల్ బీ, మ్యాథ్స్ బీ

తిరుపతి ఎడ్యుకేషన్ : విద్యార్థుల్లో ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో దాగున్న ప్రతిభను వెలికితీసేందుకు సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్షలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది ఇదివరకే నిర్వహించిన పాఠశాల స్థాయి (రౌండ్-1) స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రెండో రౌండ్ పోటీలను ఆదివారం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తిరుపతి జీవకోనలోని విశ్వం విద్యాసంస్థలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు రౌండ్-2 పోటీలను నిర్వహించనున్నారు. స్పెల్‌బీ పరీక్షను నాలుగు కేటగిరీలుగా విభజించి విద్యార్థులకు పరీక్షను చేపట్టనున్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గిద్దాం



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం ట్రైనింగ్ కో-ఆర్డినేటర్

తిరుపతి అర్బన్: రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గిద్దామని జిల్లా వనరుల కేంద్రం ట్రైనింగ్ జిల్లా కో-ఆర్డినేటర్ మెరుగు భాస్కరయ్య సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో వ్యవసాయ విస్తరణ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచుతూ ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేసేలా రైతులను ప్రోత్సహించాలని చెప్పారు. రసాయనికాలు అధికంగా వాడిన పంటలను ఆహారంగా తీసుకోవడం ద్వారానే భయంకరమైన రోగాలు వచ్చే ప్రమాదం లేకపోలేదని హెచ్చరించారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల కీటక శాస్త్ర నిపుణులు డాక్టర్ పాండురంగ మాట్లాడుతూ వరిలో చేపట్టవలసిన చీడపీడల నివారణ గురించి వివరించారు. శ్రీకాళహస్తికి చెందిన రాజేంద్రనాథ్‌రెడ్డి సహజ వనరుల సద్వినియోగం, జీవ వైవిధ్య సంరక్షణ, సేంద్రీయ సాగుపై శిక్షణ ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీదేవి, ఏఓలు శశిధర్‌రెడ్డి, వేణుగోపాలరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అనుమానితులకు వైద్యపరీక్షలు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో గంజాయి వాడుతున్నారనే ఆరోపణలపై మీడియాలో వచ్చిన వార్తలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని రిజిస్ట్రార్ రమాశ్రీ తెలిపారు. వర్సిటీలో పాక్‌శాస్త్రీ చదువుతున్న కొందరు విద్యార్థులు తరగతులకు హాజరు కావడం లేదని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. దీంతో హాస్టల్స్ అధికారులు బాలుర వసతి గృహాలలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించామని పేర్కొన్నారు. తెలియని మత్తు పదార్థాన్ని కొందరు విద్యార్థులు వినియోగించినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. వెంటనే అనుమానితులను గుర్తించి రుయా ఆస్పత్రికి నిర్ధారణ పరీక్షల నిమిత్తం పంపినట్టు ఆమె వెల్లడించారు. నివేదికలు పరిశీలించి, యాంటీ డ్రగ్స్ కమిటీ సిఫారసుల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు.

భృతికి బురిడీ!



తల్లిదండ్రులు రక్తమాంసాలు ధారబోసి కడుపున పుట్టిన బిడ్డలు ఉన్నతంగా ఉండాలని తాపత్రయపడ్డారు. కడుపు కట్టుకుని పైసాపైసా కూడబెట్టి ఉన్నత చదువులు చదివించారు. కానీ ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం.. ఉద్యోగావకాశాలు కల్పించక చతికిల పడ్డారు. తమ కాళ్లపై నిలబడాల్సిన బిడ్డలను ఇంకా తమ రెక్కల కిందే పెట్టుకుని చూసుకుంటున్నారు. ఇలాంటి వారికి గత ఎన్నికల్లో నిరోద్యోగ భృతి ఇస్తామంటూ కూటమి నేతలు ప్రగల్భాలు పలికారు. ఉద్యోగాలు వచ్చేవరకు ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికీ నెలకు రూ.3 వేల చొప్పున అందిస్తామని జబ్బలు చరిచారు. తీరా అధికారం చేపట్టాక తల్లిదండ్రులు.. నిరుద్యోగుల ఆశలను అడియాశలు చేశారు. రాష్ట్రంలోనే నిరుద్యోగులు 4 లక్షల మందేనంటూ అసెంబ్లీ సాక్షిగా అబద్ధపు లెక్కలు వల్లించారు. దీనిపై జిల్లాలోని నిరుద్యోగులు రగిలిపోతున్నారు. నమ్మించి.. వంచనకు గురిచేశారని.. భృతికి బురిడీ కొట్టారని మండిపడుతున్నారు.

- నిరుద్యోగ భృతిపై నీళ్లు చల్లిన కూటమి ప్రభుత్వం
- ఏడాదికి రూ.57 వేల కోట్లు ఎలా తేవాలంటూ నిట్టూర్పు
- నిరుద్యోగులు 4 లక్షలే అంటూ అసెంబ్లీ సాక్షిగా సీఎం అపద్ధపు లెక్కలు
- తిరుపతి జిల్లాలోనే 6 లక్షలపైనే నిరుద్యోగులు
- సీఎం తీరుపై మండిపడుతున్న యువత

నియోజకవర్గం	భృతికి అర్హులు	నెలకు అందించాల్సిన మొత్తం (రూ.కోట్లలో)
తిరుపతి	1,30,000	39
చంద్రగిరి	85,000	25.50
శ్రీకాళహస్తి	93,000	27.90
సత్యవేడు	80,000	24
వెంకటగిరి	90,000	27
గూడూరు	75,000	22.50
సూళ్లూరుపేట	70,000	21

తిరుపతి సిటీ: ఉన్నత చదువులు చదివారు. ఉద్యోగ వేటలో చతికిల పడ్డారు. పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేందుకు శక్తి వంచన లేకుండా శ్రమిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇంట్లోని ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ.3వేలు ఉద్యోగం వచ్చే వరకూ ప్రతి నెలా భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చింది. హామీ నెరవేరుస్తారని ఎంతో ఆశగా ఎదురుచూశారు. కానీ వారి ఆశలను ఆడియాశలు చేస్తూ సీఎం చంద్రబాబు భృతికి మంగళం పాడుతున్నట్లు సంకేతాలు జారీచేశారు. కూటమి ప్రభుత్వం అందించే భృతితో పోటీ పరీక్షలకు అవసరమైన దరఖాస్తులు, ఫీజులు కట్టుకునేందుకు ఆసరాగా ఉంటుందని ఆశపడ్డామని, ఇంతదారుణంగా నమ్మించి వంచన చేస్తారని ఊహించలేదని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 6 లక్షల మంది నిరుద్యోగులు

నిరుద్యోగ భృతిపై సీఎం చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే భృతి అంతా.. భ్రాంతి అని తేలిపోయిందని నిరుద్యోగులు అంటున్నారు. రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య 4 లక్షలు మాత్రమేనని, కుటుంబంలో ఒక్కరే నిరుద్యోగి ఉన్నారని, నెలకు రూ.3వేలు చొప్పున ఏడాదికి నిరుద్యోగ భృతికే రూ.57 వేల కోట్లు భారం అవుతుందని చెబుతున్నారని మండిపడుతున్నారు. కేవలం తిరుపతి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనే సుమారు 6లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని, ఈ లెక్కన జిల్లాకు నిరుద్యోగ భృతి కింద నెలకు దాదాపు రూ.180 కోట్లు చెల్లించాలని చెబుతున్నారు. తమ డబ్బులు ఎప్పుడిస్తారు బాబూ.. అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఈ వయస్సులో కూడా!



నేను పీజీ పూర్తి చేశాను. ఉద్యోగాల వేటలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాను. ఎన్నికల ముందు చంద్రబాబు నిరుద్యోగులకు రూ.3వేలు భృతి ఇస్తానని ప్రామిస్ చేశారు. అధికారం చేపట్టి ఏడు నెలలు కావస్తున్నా ఆ ఊసేలేదు. త్వరలో ఇస్తాడన్న నమ్మకం ఉండేది. కానీ అసెంబ్లీలో ఆయన పలికిన చిలకపలుకులతో ఇక భృతి మాట మరిచిపోవాలనే నిర్ణయానికి వచ్చా. నోటిఫికేషన్లు విడుదలైతే కనీసం దరఖాస్తులు చేసుకోవడానికి, మెటీరియల్స్ వంటి వాటికి ఆసరాగా ఉంటుందని భావించా. ఈ వయస్సులో కూడా తల్లిదండ్రులపై ఆధార పడాలంటే ఇబ్బందిగా అనిపిస్తోంది.

–ప్రసాద్‌రావు, ఎంఏ, బీఈడీ, తిరుపతి

బాబు నైజం భయటపడింది



చంద్రబాబు నైజం భయటపడింది. నిరుద్యోగ యువతకు భృతి ఇవ్వలేనని రీతిలో అసెంబ్లీలో ప్రస్తావించడం దారుణం. నేను పీహెచ్‌డీ పూర్తి చేశాను. ఉద్యోగం వచ్చే వరకు ప్రభుత్వం నిరుద్యోగ భృతిని చెల్లిస్తుందని ఆశతో ఉన్నా. ఇంత దారుణంగా నిరుద్యోగులను వంచిస్తాడని అనుకోలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల మంది నిరుద్యోగులున్నారంటూ సీఎం స్థాయి వ్యక్తి అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటు. ఏపీపీఎస్సీ పరీక్షల అర్హత వయస్సును ప్రామాణికంగా తీసుకోవాలి.

–చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెస్సీ, తిరుపతి

ఆ మాటలను ఖండించాలి



నిరుద్యోగ భృతిపై సీఎం చంద్రబాబు చెబుతున్న మాటలపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ స్పందించాలి. జనసేన కార్యకర్తలు, పవన్ ఫ్యాన్స్ ఎంతో మంది నిరుద్యోగులుగా ఉన్నారు. భృతి ఇస్తామంటేనే ఓటు వేసి గెలిపించారు. బాబు కల్లబొల్లి మాటలు వింటూ పవన్‌కళ్యాణ్ మౌనంగా ఉంటే యువతను వంచించిన వారి జాబితాలో చేరే అవకాశం ఉంది. తక్షణం నిరుద్యోగ భృతిని అందించేలా చంద్రబాబుపై ఒత్తిడి తేవాలి. యువతను ఆదుకోవాలి.

–లక్ష్మీప్రియ, పీహెచ్‌డీ, తిరుపతి

భృతి ఇవ్వరు...ఉద్యోగాలు భర్తీ చేయరు



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే పరిస్థితి లేదని స్పష్టమైంది. నిరుద్యోగ భృతిపై చేతులెత్తేశారు. కనీసం ఉద్యోగాలు భర్తీ చేస్తారా..? అంటే అదీ లేదు. బాబు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే తొలి సంతకం మెగా డీఎస్సీపై చేశారు. ఏడు నెలలు గడిచింది. ఇంతవరకు నోటిఫికేషన్ లేదు. ప్రభుత్వ శాఖలో 10 లక్షలకు పైగా ఖాళీలు ఉన్నా పట్టించుకోలేదు. నిరుద్యోగులపై అపార ప్రేమ కనబరచిన మంత్రి లోకేష్ భృతిపై నోరు మెదపకపోవడం దారుణం.

–శోభారాణి, బీఎస్సీ, బీఈడీ, తిరుపతి

బాబు మాటలు వింటే..?



చంద్రబాబు అసెంబ్లీలో నిరుద్యోగ భృతిపై చెప్పిన లెక్కలు చూసి నవ్వుకుంటున్నా. గణాంకాలు చదివేందుకు సులువుగా ఎవరో తయారు చేసినట్లుంది. భృతి ఇవ్వాలనే నెపంతో నిరుద్యోగుల సంఖ్య భారీగా తగ్గించారు. ఏ ప్రాతిపదికన నిరుద్యోగులను లెక్కగట్టారో అర్థం కావడం లేదు. టీచర్ ఉద్యోగాలు లేవు, వర్సిటీలలో గత ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను ఆపేశారు. ఏపీలో అస్తవ్యస్త పాలన సాగుతోంది.

–నిరంజన్, గ్రూప్స్‌కు సన్నద్ధమవతున్న విద్యార్థి, తిరుపతి

మరోమారు మోసపోయారు



నేను ఎంఏ, పీహెచ్‌డీ పూర్తి చేశాను. పోటీ పరీక్షలకు సన్నద్ధమవడం తప్ప నోటిఫికేషన్లు రావడంలేదు. కనీసం చేతి ఖర్చులకు పైసా లేదు. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లి ఖర్చులకు ఇస్తున్నారు. వారి కష్టాలు తీర్చాలనే తపనతో కష్టపడుతున్నా. ఒక్కటంటే ఒక్క నోటిఫికేషన్ రాలేదు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ నిరుద్యోగులను బాబు మోసం చేస్తున్నారు. ఈ దఫా అదే బాటలో బాబు సర్కార్ నడవడం దారుణం.

–సోమశేఖర్, ఎంఏ, పీహెచ్‌డీ, తిరుపతి

నయనానందకరం



మైమరపించిన కళాకారిణి నృత్యం



మాట్లాడుతున్న టీటీడీ విశ్రాంత డెప్యూటీ ఈఓ చిన్నంగారి రమణ

తిరుపతి కల్చరల్: జై జవాన్, జై కిసాన్, జై కళాకార్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన అన్నమయ్య సంగీత, నృత్యోత్సవాలు ప్రేక్షకులను అలరింపజేశాయి. రెండు రోజుల పాటు తలపెట్టిన ఈ నృత్యోత్సవాలను తొలి రోజు శనివారం ఉదయం వేడుకగా ప్రారంభించారు. కార్యక్రమానికి అన్నమాచార్య వంశీకుడు హరినారాయణాచార్యులు, టీటీడీ విశ్రాంత డెప్యూటీ ఈవో చిన్నంగారి రమణ, విజయకుమార్, ధర్మయ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జై జవాన్, జై కిసాన్, జై కళాకార్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ కేవీ.రమణారావు మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్, జై జవాన్, జై కిసాన్, జై కళాకార్ సంస్థల ద్వారా ఎంతో మంది కళాకారులకు విదేశీ వేదికలలో ప్రదర్శనలకు అవకాశాలు కల్పించినట్టు వెల్లడించారు. కార్యక్రమాల నిర్వహణతో 9 ప్రపంచ రికార్డులు కైవశం చేసుకోవడం సంతోషకరమన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన సుమారు 250 మంది కళాకారులు తమదైన శైలిలో గానాలాపన, నృత్యాభినయాలతో సభికులను రంజింపజేశారు. గురువులు సత్యవాని, కె.సుహాసిని, సుధాకమల, అనురాధ, డాక్టర్ ఎం.మధుబాబు, బులెట్ రమణ, శర్మ, సిద్ధయ్య, ఇరముని శేఖర్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం



సీఐ, ఎస్ఐలతో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపి, పటిష్ట చర్యలు చేపట్టాలని, బీట్ సిస్టం బలోపేతం చేసి అధికారుల పర్యవేక్షణ నిరంతరాయంగా ఉండాలని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు సిబ్బందిని ఆదేశించారు. ఆయన శుక్రవారం రాత్రి బుచ్చినాయుడుకండ్రిగలోని పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలు, గదులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం జనరల్ డైరీ, కేసు డైరీ, కోర్టు క్యాలెండరు వంటి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, తగాదాలు లేకుండా కౌన్సెలింగ్ ఇచ్చి ప్రశాంతమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాత, కొత్త నేరస్తులు, అనుమానితుల కదలికలపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. శాంతి భద్రతలను కాపాడాలని సూచించారు. పోలీసుస్టేషన్‌కు అందే ఫిర్యాదులను నిష్పక్షపాతంగా విచారించాలని చెప్పారు. డయల్ – 112 ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలన్నారు. ఎస్పీ వెంట సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథ నాయుడు ఉన్నారు.

కుర్చీ కోసం కుట్ర

మేయర్ పీఠం కోసం కూటమి నేతలు కుట్రకు పదునుపెట్టారు. తిరుపతిలో బలంగా ఉన్న వైఎస్సార్‌సీపీ కుటుంబాన్ని చీల్చి కార్పొరేటర్లను కరివేపాకులా వాడుకుని వదిలేయాలని నిర్ణయించుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు రకరకాల ప్రలోభాలకు గురిచేసి కూటమి పార్టీలో చేర్చుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కూటమి నేతల మాయమాటలు విని టీడీపీ, జనసేనలో చేరితే.. బలిపశువులు కాకతప్పదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

తిరుపతిలో కార్పొరేటర్లను బలిచేసేందుకు స్కెచ్

- రకరకాల ప్రలోభాలకు గురిచేస్తున్న వైనం
- పదవులు, పార్టీకి రాజీనామా చేయాలన్న సిద్ధాంతంపై చర్చ
- పదవులు పోయాక కూటమి పార్టీ నేతలు విలువ ఇస్తారా?
- కుప్పం, పుంగనూరు పరిణామాలను బేరీజు వేసుకుంటున్న కార్పొరేటర్లు
- మరో వైపు 'అన్నా' కుటుంబంపై అధిష్టానానికి కూటమి నేతల ఫిర్యాదు

సాక్షి, తిరుపతి టాస్క్‌ఫోర్స్: తిరుపతి కార్పొరేషన్ ఎన్నికల్లో 50 డివిజన్లలో 49 వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే విజయం సాధించిన విషయం తెలిసిందే. జనరల్‌కి కేటాయించిన మేయర్ పీఠాన్ని భూమన కరుణాకరరెడ్డి స్థానిక పరిస్థితులను వివరించడంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీ మహిళకు కట్టబెట్టారు. అది కూడా యాదవ సామాజిక వర్గానికి చెందిన మహిళను అత్యున్నత మేయర్ పీఠంపై కూర్చోబెట్టారు. ప్రస్తుత ఈ పాలక వర్గానికి ఇక మిగిలింది ఏడాదే. మేయర్ పీఠం కోసం కొందరు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను బలిచేసేందుకు కూటమి నేతలు కుట్రలకు తెరతీశారు.

ప్రాధాన్యత ఉంటుందా..?

ఇతర పార్టీలో నుంచి వచ్చిన వారికి పదవులు ఇవ్వడానికి కూటమి నేతలు ఒప్పుకునే పరిస్థితిలో లేరు. అందుకు అదిష్టానం కూడా సిద్ధంగా లేదు. కూటమిలో చేరిన వారికి కూడా ఆయా పార్టీల్లో ప్రాధాన్యత ఇవ్వడం లేదు. అందుకే పుంగనూరు వంటి మున్సిపాలిటీ పరిధిలో టీడీపీలో చేరిన కొందరు కౌన్సిలర్లు కూటమి మాయమాటలు విని మోసపోయామని గ్రహించి తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరిన విషయం తెలిసిందే. కుప్పంలోనూ టీడీపీ నేతల మాటలు విని పదవి, పార్టీకి రాజీనామా చేసిన కౌన్సిలర్లు అటూ ఇటు కాకుండా తయారయ్యారు. టీడీపీలో గుర్తింపు లేకపోవడంతో ఎందుకు పార్టీ మారామా? అని తలలు పట్టుకుంటున్నారు. కుప్పం, పుంగనూరులో చోటు చేసుకుంటున్న పరిణామాలను బేరీజు వేసుకుని కొందరు కార్పొరేటర్లు కూటమి పార్టీలో చేరితే తమ పరిస్థితి కూడా అంతే కదా? అనే అలోచనలో పడ్డారు.

ప్రలోభాల ఎర

కార్పొరేటర్లకు పదవులు, పనులు, నగదు ఇస్తామని హామీలు గుప్పించారు. అందులో భాగంగా కొందరికి అడ్వాన్స్ పేరుతో కొంత నగదు ముట్టజెప్పారు. పార్టీలో చేరి మేయర్ పదవికి మద్దతు ఇస్తే.. మిగిలిన నగదుతో పాటు పనులు, పదవులు ఇప్పిస్తామని మాట ఇచ్చినట్టు సమాచారం.

రాజీనామా చేయకపోతే ఒప్పుకుంటారా?

టీడీపీ, జనసేనలో పదవులు కోసం ఎదురుచూసే వారంతా ప్రతిపక్ష పార్టీల నుంచి వచ్చే నాయకులను చేర్చుకోవద్దని అధిష్టానానికి తేల్చిచెప్పారు. అలా చేస్తే.. మా దారి మేము చూసుకోవాల్సిందేనని అల్టిమేటం జారీ చేయడంతో అధిష్టానం ఆలోచనలో పడింది. ఇతర పార్టీల నుంచి వచ్చే నాయకులకు కూటమి పార్టీలు ఒక నిబంధన పెట్టుకుంది. ఏ పార్టీ నుంచైనా వచ్చే నాయకులు ఆ పార్టీ సభ్యత్వానికి, పదవులకు రాజీనామా చేసి రావాలని స్పష్టం చేశారు. తిరుపతి పరిధిలోని కార్పొరేటర్లు రేపు టీడీపీ, జనసేనలో చేరాలంటే వైఎస్సార్‌సీపీ సభ్యత్వానికి, పదవులకు రాజీనామా చేస్తే గాని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కండువా కప్పే పరిస్థితి లేదు. ఒకవేళ మంత్రుల ఆధ్వర్యంలో కండువా కప్పుకున్నా చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కి అటువంటి వారికి ప్రాధాన్యత ఇస్తారనేది అనుమానమే. రాజీనామా చేస్తే రేపు తిరిగి వీరికే కార్పొరేటర్ అభ్యర్థిగా ప్రకటిస్తారన్నది అనుమానమే. ఇంత గందరగోళం నేపథ్యంలో కేవలం ఏడాది కాలానికి గుర్తింపు నిచ్చి, పదవిని కట్టబెట్టిన వైఎస్సార్‌సీపీని విడిచి వెళ్తే స్థానిక జనం నుంచి వ్యతిరేకతను మూటగట్టుకోవడంతో పాటు.. రెంటికీ చెడ్డ రేవడిలా మిగిలిపోతామేననే భయం కార్పొరేటర్లను వెంటాడుతోంది.



కూటమిలో కుంపట్లు

తిరుపతిలోని కూటమి పార్టీల్లో ఒకరిపై ఒకరు అధిష్టానానికి ఫిర్యాదులు చేసుకుంటున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం మేయర్ పీఠాన్ని ఆశిస్తున్న అన్నా రామచంద్రయ్యపై టీడీపీ నాయకులు కొందరు సీఎంకు ఫిర్యాదులు చేశారు. అన్నా రామచంద్రయ్యను పార్టీలోకి తీసుకోవడమే పెద్ద నేరమన్నట్లు సమాచారం. అన్నా కుటుంబం కారణంగా నగరంలో పార్టీకి చెడ్డ పేరు వస్తుందని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇటీవల నగరంలో ఓ భవనాన్ని ఆక్రమించుకునేందుకు యత్నించారని సీసీ ఫుటేజీలను, గతంలో భూ ఆక్రమణలకు పాల్పడ్డారని, తిరుపతిలో పేరుమోసిన రౌడీ అని ఆధారాలతో సహా అధిష్టానానికి అందించినట్లు విశ్వసనీయ సమాచారం. అందుకే చంద్రబాబు కూడా అన్నా రామచంద్రయ్య పట్ల అనుకూలంగా లేరని టీడీపీ నేతలే చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో వారిని నమ్మి తల్లిలాంటి వైఎస్సార్‌సీపీని విడిచి టీడీపీ, జనసేనలో చేరితే రాజకీయ భవిష్యత్తు ఉండదనే ఆలోచనలో పడినట్లు కార్పొరేటర్లలో చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా



ఎస్పీ సుబ్బరాయుడుతో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

తిరుపతి మంగళం : ఎర్రచందనం అక్రమ రవాణా అరికడతామని నూతనంగా బాధ్యతలు చేపట్టిన టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ వీ.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. శనివారం ఆయన కపిలితీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాసరెడ్డి ఇది వరకు సూళ్లూరుపేట డీఎస్పీగా పనిచేశారు.

30 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

తిరుపతి మంగళం: వైఎస్సార్ జిల్లా, ముద్దనూరు వద్ద 30 ఎర్రచందనం దుంగలతో పాటు కారును స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్టు టాస్క్ ఫోర్సు డీఎస్పీ జీ.బాలిరెడ్డి తెలిపారు. రైల్వే కోడూరు సబ్‌కంట్రోల్ నుంచి ఆర్ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐ కే.అల్లిబాషా బృందం, ఎఫ్‌బీవో పి.సుప్రజతో కలసి జమ్మలమడుగు వైపు శనివారం తనఖీలు నిర్వహించారు. ముద్దనూరు మండలం, శెట్టివారిపల్లి ఫారెస్టు బీటు పరిధిలోని ఖాళీ ఇళ్ల వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను కారులో లోడ్ చేస్తూ కనిపించినట్లు తెలిపారు. టాస్క్ ఫోర్సు పోలీసులు వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయడంతో కొందరు పారిపోగా.. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. వారు వైఎస్సార్ జిల్లాకు చెందిన వ్యక్తులుగా గుర్తించినట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో 30 ఎర్రచందనం దుంగలను, కారుతో సహా స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం వాటిని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించగా, ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



బీవీ.శ్రీనివాసులు, సీఐ

శ్రీసిటీ (వరదయ్యపాళెం): గ్రామాల్లో ఎవరైనా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ సీఐ బీవీ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం ఆయన పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వం అనుమతి పొందిన నాలుగు మద్యం షాపులు ఉన్నాయని, ఆ షాపులకు అనుబంధంగా పరిసర గ్రామాల్లో ఎవరైనా బెల్టు షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బెల్టు షాపులు నిర్వహిస్తూ పట్టుబడిన వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకునే మద్యం బాటిళ్ల ఆధారంగా వారికి సరఫరా చేసిన దుకాణాన్ని గుర్తించి లైసెన్స్ కూడా రద్దు చేసే చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. కేసులు కూడా నమోదు చేస్తామని చెప్పారు.

తిరుచానూరు బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- టీటీడీ ఈఓ శ్యామలరావు ఆదేశం
- అధికారులతో సమీక్ష

చంద్రగిరి(తిరుచానూరు)/తిరుపతి (అలిపిరి) : తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు టీటీడీ ఈఓ శ్యామలరావు తెలిపారు. ఆయన శనివారం టీటీడీ తిరుపతి జేఈఓ వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభమ్ బన్సల్ తదితర అధికారులతో కలిసి తిరుచానూరులోని పసుపు మండపం నుంచి పుష్కరిణి, ఆలయ వీధుల్లో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ 28 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయని, అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. చలువ పందిళ్లు, రంగోలీలు, క్యూలైన్లు, బారికేడ్లు తదితర ఇంజినీరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆలయం, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ అలంకరణలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, పీఏ సిస్టమ్, ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేయాలన్నారు. హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కళాబృందాలతో ఆకర్షణీయంగా ఉండేలా ప్రదర్శనలు చేపట్టాలని సూచించారు.

అధికారులతో సమీక్ష

అనంతరం ఈవో తిరుపతిలోని శ్రీ పద్మావతి గెస్ట్ హౌస్‌లో తిరుపతి టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తదితర అధికారులతో సమీక్షించారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా డిసెంబర్ 6న నిర్వహించనున్న పంచమీ తీర్థం పర్వదినానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని, పుష్కరిణిలో తోపులాటలు జరగకుండా చూడాలన్నారు. వాహన సేవల అనంతరం భక్తులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. భక్తుల తాకిడికి తగ్గట్టు అన్నప్రసాదాలు పంపిణీ చేయాలన్నారు.



బ్రహ్మోత్సవం సందర్భంగా ట్రాఫిక్, ఇతర సౌకర్యాలను ఈఓకు వివరిస్తున్న అధికారులు

ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు

భక్తులను ఆకట్టుకునేలా తిరుపతిలోని మహతి కళాక్షేత్రం, అన్నమాచార్య కళామందిరం, రామచంద్ర పుష్కరిణి, శిల్పారామం, తిరుచానూరులోని ఆస్థాన మండపంలో ధార్మిక, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని ఈఓ సూచించారు. కోరారు. అలాగే తిరుచానూరులోని శుక్రవారపు తోటలో పుష్ప ప్రదర్శనశాలలో ఆకట్టుకునేలా పుష్పాలంకరణలు చేపట్టాలని సూచించారు. తోళప్ప గార్డెన్స్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అన్నప్రసాద వితరణకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో టీటీడీ ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, చీఫ్ ఇంజినీర్ సత్యనారాయణ, ఎఫ్ఏ–సీఏవో బాలాజీ, ఎస్ఈ(ఎలక్ట్రికల్స్) వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, ఆలయ డెప్యూటీ ఈవో గోవింద రాజన్, తదితర అధికారులు పాల్గొన్నారు.

‘తెల్ల’రాజకీయాలొద్దు!

- రాష్ట్ర సంగీత అకాడమీ మాజీ చైర్‌పర్సన్ పాటేళ్ల శిరీషాయాదవ్



మాట్లాడుతున్న పాటేళ్ల శిరీషయాదవ్

సైదాపురం: మండలంలోని తెల్లరాయి చుట్టే జిల్లా రాజకీయం సాగుతోందని, ప్రకృతి సంపదను దోచుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని రాష్ట్ర సంగీత అకాడమీ మాజీ చైర్‌పర్సన్ పాటేళ్ల శిరీషాయాదవ్ హెచ్చరించారు. శనివారం ఆమె సైదాపురంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని రాజకీయం మొత్తం సైదాపురంలోని తెల్లరాయి చుట్టూ తిరుగుతున్నట్లు ఆరోపించారు. కేవలం గనుల్లో వచ్చే అక్రమ లాభం కోసమే కొందరు ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీని వీడారని విమర్శించారు. ఎన్నికల ముందు మాజీ రాజ్యసభ సభ్యులు, ప్రస్తుత లోక్‌సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మరికొందరు వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలోకి వెళ్లినట్టు ఆరోపించారు. వారు పార్టీ మారేదానికి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి అనీల్‌కుమార్‌యాదవ్‌లు కారకులు కాదని స్పష్టం చేశారు. అక్రమ మైనింగ్ చేసే ఉద్దేశం లేనప్పుడు లీజు కాలం చెల్లిన నాలుగు మైనింగ్‌లను ఎలా కొనుగోలు చేస్తారని నిలదీశారు. ఆ మైన్‌లు అన్నీ అక్రమించుకుని కనిజ సంపదను దోచుకోవడం నిజం కాదా.. అని ప్రశ్నించారు. గత అక్టోబర్ 24వ తేదీన పద్మవతి మైనింగ్‌లో అక్రమమాలకు పాల్పడుతుండగా సైదాపురం మండల ప్రజలు అడ్డుకున్నారని తెలిపారు. అప్పటి నుంచి ఓ వాహనం సైదాపురం పోలీసు స్టేషన్‌లోనే ఉందన్నారు. సైదాపురం మండలంలో ఉన్న క్వార్ట్జ్ అక్రమ రవాణా చేసేందుకు షరతులతో ఒప్పందాలు కుదుర్చుకున్నది నిజం కాదా అని విమర్శించారు. ఈ ఆరోపణలపై అధికార పార్టీ పెద్దలు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పకృతి సంపదను దోచుకోవాలని చూస్తే వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ తరఫున గట్టిగా ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు.

ఉపాధ్యాయులపై వడ్డీ వ్యాపారి దాడి



గాయపడిన ఉపాధ్యాయుడు ఆదిశేషయ్య

కోట: మండలంలో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులపై వడ్డీ వ్యాపారి దాడి చేయడం చర్చనీయాంశంగా మారింది. నెల్లూరుకు చెందిన వడ్డీ వ్యాపారి తన అనుచరులతో వచ్చి దాడికి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు..చెందోడు ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఆదిశేషయ్య, తూర్పుకండ్రిగ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శేఖర్ నెల్లూరుకు చెందిన ఫైనాన్స్ వ్యాపారి రాజా వద్ద కొంతకాలం క్రితం రూ.2 లక్షలు తీసుకుని నెలనెలా వడ్డీతో కలిపి చెల్లిస్తున్నారు. వాయిదాలు సక్రమంగా చెల్లించడం లేదని శనివారం వడ్డీ వ్యాపారి ఇద్దరు అనుచరులతో కలసి ముందుగా చెందోడు పాఠశాలలో ఆదిశేషయ్య వద్దకు వెళ్లి అతనిపై దాడికి పాల్పడ్డాడు. దాడిలో ఉపాధ్యాయుడికి రక్తగాయాలయ్యాయి. అలాగే తూర్పుకండ్రిగ పాఠశాలకు వెళ్లి మరో ఉపాధ్యాయుడు శేఖర్‌పై కూడా దాడికి పాల్పడ్డారు. వడ్డీతో సహా మొత్తం చెల్లించాలని లేదంటే చంపేస్తామని బెదిరించినట్లు తెలిపారు. గాయపడిన ఆదిశేషయ్యను కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధిత ఉపాధ్యాయులు ఇద్దరూ ఎస్టీలు కావడంతో ఉపాధ్యాయులకు మద్దతుగా బీటీఏ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వడ్డీవ్యాపారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

- హత్య కేసులో ఐదుగురి అరెస్ట్
- వీరిలో ఇద్దరు రౌడీ షీటర్లు



హత్యకు ఉపయోగించిన కారు, కర్రలు, టిమ్మర్, తాడును చూపుతున్న పోలీసులు

వాకాడు: వివాహేతర సంబంధం హత్యకు దారి తీసిన ఘటన వాకాడు మండలం, దుగ్గరాజపట్నం సమీపంలో ఈ నెల 17న చోటుచేసుకుంది. ఈ మేరకు పోలీసులు నిందితులను శనివారం అరెస్ట్ చేశారు. వాకాడు సీఐ హుస్సేన్‌బాషా విలేకరులతో మాట్లాడుతూ గూడూరు పట్టణం, శివాలయం ప్రాంతానికి చెందిన కొండా అనిత్‌కుమార్‌రెడ్డి (25)కు గూడూరులోని కనుపూరు శ్రీహరి అలియాస్ జెమిని అనే రౌడీ షీటర్ భార్యతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం శ్రీహరి దృష్టికి రావడంతో అనిత్‌రెడ్డిపై పగ పెంచుకున్నాడు. పట్టణంలోని మరో రౌడీ షీటర్ బాసం నరేష్ అలియాస్ చిన్నప్రేమ్, కోట మండలం, విశ్వనాథ అగ్రహారానికి చెందిన పేనాటి అలియాస్ పేర్నాటి చందు, గూడూరు చవటపాళెంకు చెందిన షేక్ కాలేషా, గూడూరు గాంధీనగర్‌కు చెందిన జావీదులతో కలసి అనిత్‌రెడ్డిని హత్య చేసేందుకు పథకం రూపొందించారు. ఈ నేపథ్యంలో చిల్లకూరు చుట్టుగుంట సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న దాబాను కేంద్రంగా చేసుకున్నారు. అనిత్‌రెడ్డికి మద్యం పార్టీ ఉందని నమ్మించి గూడూరు హైవే రోడ్డు నుంచి దాబా వద్దకు తన స్నేహితులు స్కూటీపై తీసుకొచ్చారు. అక్కడ మద్యం సేవించిన అనంతరం ఐదుగురూ కలసి అనిత్‌రెడ్డిని కర్రలతో కొట్టి చంపేశారు. తర్వాత టిమ్మర్‌తో తల వెంట్రుకలు, మీసాలు తీసి ఆనవాళ్లు గుర్తుపట్టని విధంగా చెరిపేశారు. ఆపై మృతదేహాన్ని కారు డిక్కీలో ఉంచుకుని దుగ్గరాజపట్నం సమీపంలోని పొలాల్లో పడేసి వెళ్లారు. స్థానికుల సమాచారంతో వాకాడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విచారణలో హత్య వెనుక వివాహేతర సంబంధం ఉన్నట్లు గుర్తించినట్టు సీఐ తెలిపారు. ఆ కోణంలో దర్యాప్తు చేపట్టి శ్రీహరి(జెమిని), నరేష్(చిన్నా ప్రేమ్)తోపాటు, పేనేటి చందు, షేక్ కాలేషా, షేక్ జావీదులను అరెస్టు చేసినట్టు వెల్లడించారు. వారిచ్చిన సమాచారం మేరకు గూడూరు నారాయణ ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలోని రోడ్డు వద్ద మిగిలిన ఇద్దర్నీ అరెస్టు చేశామన్నారు. అనంతరం ఐదుగురు నిందితులను కోర్టులో హాజరు పరచనున్నట్టు తెలిపారు. మొదటి ముద్దాయి శ్రీహరిపై గూడూరు 1వ పట్టణ స్టేషన్‌లో, రెండో ముద్దాయి షేక్ కాలేషాపై రూరల్ పోలీస్టేషన్‌లో 5 క్రిమినల్ కేసులు, రౌడీ షీట్లు ఉన్నట్లు సీఐ తెలిపారు. త్వరితగతిన కేసును ఛేదించిన గూడూరు డీఎస్పీ రమణ్‌కుమార్‌ని అభినందించారు. ఎస్ఐలు నాగబాబు, పవన్‌కుమార్, చిన బలరామయ్య పాల్గొన్నారు.

పది పరీక్షలకు సన్నద్ధం కావాలి



చిల్లకూరులో విద్యాబోధన చేస్తున్న డీఈఓ కేవీఎస్ కుమార్

చిల్లకూరు: విద్యార్థులు ఇప్పటి నుంచే పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలని డీఈఓ కేవీఎస్ కుమార్ పిలుపునిచ్చారు. చిల్లకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం ఎలా ఉంది..? అనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు కొంత సేపు బోధన చేశారు. అనంతరం ప్రశ్నలు వేసి వారి వద్దనుంచి సమాధానాలు రాబట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదిలో మంచి ఫలితాలు సాధించాలంటే ఇప్పటి నుంచే రోజుకు కనీసం 8 గంటలపాటు చదవాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం జాన్‌పీటర్, ఉన్నారు.

జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం నియామకం



దమరక నాథగుప్తా, వెంకటసుబ్బరాజు, హరీష్‌బాబు

భాకరాపేట : తిరుపతి రూరల్ జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్య వైశ్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడుగా నూనె దమరక నాథగుప్తా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దూపకుంట్ల శబరీ వరప్రసాద్, తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గూడూరు కిశోర్‌కుమార్ ప్రకటించారు. శనివారం చిన్నగొట్టిగల్లులో జరిగిన కార్యక్రమంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వెంకటసుబ్బరాజు, కోశాధికారిగా హరీష్‌బాబును నియమించినట్లు తెలిపారు.

మెడలోని చైన్‌ను లాక్కెళ్లిన దుండగుడు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని గిండివారి వీధిలో నివాసం ఉంటున్న గిండి సావిత్రమ్మ అనే వృద్ధురాలి మెడలోని బంగారు చైన్‌ను గుర్తుతెలియని వ్యక్తి లాక్కెళ్లిన ఘటన శనివారం స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల కథనం.. ఉదయం సావిత్రమ్మ తన ఇంటి ముందు ముగ్గు వేస్తోంది. ఇంటి సమీపంలో నిలుచుకుని ఉన్న గుర్తుతెలియని వ్యక్తి హఠాత్తుగా వచ్చి మెడలో ఉన్న బంగారు చైన్‌ను లాక్కొని పరారయ్యాడు. సమాచారం అందుకున్న సీఐ బాబి ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. సావిత్రమ్మ ఇంటి సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

నారాయణవనం: మండలంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మండలంలోని వెత్తలతడుకు సమీపంలో రాళ్ల కాలువ వద్ద జాతీయ రహదారికి పక్కనే మృత దేహాన్ని గుర్తించిన వాహన చోదకులు సమాచారాన్ని అందించారన్నారు. సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమై మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా ఏఎంఆర్ అవగాహన వారోత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

తిరుపతి తుడా : శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో స్విమ్స్, ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఏఎంఆర్ అవగాహన వారోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, ఫార్మాకాలజీ విభాగాధిపతి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ యాంటీ మైక్రోబయాల్ రెసిస్టెంట్ (ఏఎంఆర్) అనేది ప్రపంచ ప్రజారోగ్యానికి పెరుగుతున్న తీవ్రమైన ముప్పు అని పేర్కొన్నారు. ఇది మానవ, జంతువుల ఆరోగ్యం, ఆహారోత్పత్తి, పర్యావరణంపై గణనీయమైన ప్రభావం చూపుతుందని తెలిపారు. డ్రగ్ రెసిస్టెంట్ ఇన్ఫెక్షన్ల ఆవిర్భావం, వ్యాప్తిని తగ్గించడానికి అవగాహన కార్యక్రమాలను ప్రతి ఏటా ప్రపంచ వ్యాప్తంగా నవంబర్ 18–24 వరకు జరుపుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ డాక్టర్ జయప్రద, మైక్రోబయాలజీ విభాగాధిపతి వెంకటరమణ, ఫార్మకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.రవీంద్రకుమార్, ఫార్మకాలజీ వైద్యులు ఎ.సాయికిరణ్, డాక్టర్ పి.అనూహ్య తదితరులు పాల్గొన్నారు.